28.

# దైవానుగ్రహముచే దేనినైనా సాధించవచ్చు

న తపాంసి, న తీర్థానాం న శాస్త్రాణాం జపానపి
సంసార సాగరోద్ధారే సజ్జనం సేవనం వినా

ప్రేమస్వరూపులారా!

మానవుడు తరించే నిమిత్తమై అనేక విధములైన సాధనలు సల్పుతున్నాడు. తపస్సు చేయటం ఎవరికోసం? తపస్సు వలన కలిగే ఫలితం తన కోసమేగానీ పరులకు కాదు. పరమాత్మకు కాదు. జపము చేయటము తన ఆనంద నిమిత్తమేగానీ పరుల నిమిత్తము కాదనే సత్యాన్ని గుర్తించాలి. మనము నిత్యజీవితమునుంచి తరించవలెనన్న ఏమి చేయాలి? జపము కాదు, తపము కాదు, యోగము కాదు, యాగము కాదు యజ్ఞము కాదు. తోటి మానవుని యొక్క సేవ చేయాలి. సేవయే ప్రధానమైన పూజ. సేవయే ప్రధానమైన తపస్సు. సేవయే ప్రధానమైన జపము. ధనము కోల్పోయిన తిరిగి సంపాయించుకోవచ్చు. మిత్రుని కోల్పోయిన మిత్రుని సంపాయించుకోవచ్చు. పత్నిని కోల్పోయిన రెండవ వివాహమాడి పత్నిని కూడా సంపాయించుకోవచ్చు. కానీ దేహమును కోల్పోయిన తిరిగి ఆ దేహాన్ని సంపాయించుకోలేరు. కనుక దేహము చాలా పవిత్రమైనది. ఈ పవిత్రమైన దేహమును మనం దేని నిమిత్తమై కాపాడుకోవాలి? 'శరీరమాద్యం ఖలు ధర్మ సాధనం.' ధర్మాచరణనిమిత్తమై, సేవాచరణ నిమిత్తమై ఈ దేహమును కాపాడుకోవాలి. మానవజన్మ చాలా దుర్లభమైనది. చాలా పవిత్రమైనది. మానవత్వము ధరించికూడను మానవత్వము యొక్క రహస్యాన్ని గుర్తించుకోలేకపోయిన మానవజన్మ వలన ప్రయోజనం ఏమిటి? అయితే ఈ మానవునకు ఆలోచన సహజము. మానవుని యొక్క అన్వేషణ ద్వారానే అంతర్భావమైన తరంగముల నుండి అనేక శాస్త్రములు, ఉపనిషత్తులు, చిత్రశిల్పి యిత్యాది కళలంతా ఏర్పడుతున్నాయి. కానీ మానవుడు తన బుద్ధి యొక్క ప్రవర్తన గుర్తించుకొనలేక సత్యమును సరైన మార్గములో అన్వేషణ సల్పలేక ఒక్కొక్కరు ఒక్కొక్క విధమైన మార్గములో

sri sathyasai vachanamrutam

సత్యాన్వేషణ సల్పుతున్నారు. ఒకరు ఒక వృక్షము చూస్తాడు. అతను కనిపించే శాఖలను మాత్రమే చూస్తున్నాడు గానీ కనిపించని వేళ్లను చూడటం లేదు. కానీ మరొకరు వేర్లను మాత్రమే చూస్తున్నాడు గానీ శాఖలను చూడటంలేదు. ఇది సత్యాన్వేషణకు సహజమైన తత్వము కాదు. సత్యాన్వేషణ అనగా శాఖలను, వేర్లను, చెట్టు యొక్క సంపూర్ణమైన స్థితిని గుర్తించటమే సత్యాన్వేషణ. శాఖలను చూచువాడు సైంటిస్టు. కానీ వేర్లను చూచువాడు వేదాంతి. వేదాంతిగానీ, సైంటిస్టుగానీ ఎవరైనా శాఖలను, వేర్లను, కొమ్మలను, రెమ్మలను అన్నింటిని గుర్తించటమే సరియైన సత్యాన్వేషణ. దీనికొక చిన్న ఆదర్శము. దేవతలు, రాక్షసులు యిరువురు చేరి పాలసముద్రమును మధనం చేశారు. కానీ అందులో హాలాహలము ఆవిర్భవించింది. అంతటితో వారు నిరాశకు చోటివ్వక, నిస్పృహకు ఏమాత్రము గురికాక తిరిగి మధనము చేస్తూ వచ్చారు. అప్పుడు లక్ష్మి, అనేక శోభలు, అమృతము, ఐరావతము యిత్యాది పవిత్రమైన సంపదలన్నీ వారికి లభ్యమైనాయి. దేనివల్ల లభ్యమైనాయి? కలిగిన అభ్యంతరములకు ఏమాత్రము జంకక, కృంగక తపస్సాధనలు సక్రమంగా జరపటంచేతనే విజయాన్ని సాధిస్తూ వచ్చారు. ఈనాటి మానవుడు మానవ హృదయాన్ని సత్యాన్వేషణ సల్పాలి. మానవుని యొక్క హృదయము క్షీరసాగరము. ఈ సముద్రములో జ్ఞానమనే కవ్వము వేసి మధనము సల్పగా మొదట కొంత నిరాశ నిస్పృహ ఆవిర్భవిస్తాయి. దీనిని లెక్క చేయక తిరిగి మధనము చేస్తూ వచ్చినప్పుడు ధర్మము, న్యాయము, సత్యము పవిత్రమైన గుణములు ప్రాప్తిస్తుంటాయి. సహనము, సానుభూతి, కరుణ దయ యిందులో ఆవిర్భవిస్తుంటాయి. కనుక మానవుడు దయచేతను, ధర్మముచేతను, ప్రేమచేతను, న్యాయముచేతను, సహనముచేతను, సానుభూతిచేతను జీవించుటకు తగిన కృషి చేయాలి. ఈ అన్వేషణలో జరిగే సత్యప్రాప్తికి ఏమాత్రం చోటు యివ్వక బాహ్యమైన, లౌకికమైన, ప్రాకృతమైన, పవిత్రము కాని, అస్థిరమైన వస్తువులకై ప్రాకులాడుతున్నాడు ఈనాటి మానవుడు. నిత్యసత్యమైన ప్రాప్తికి ప్రతి మానవుడు తన జీవితకళలను అర్పితం గావించాలి. సమస్త లలితకళలు అన్నీ సత్యాన్వేషణలో ఆవిర్భవించినవే. ఈ సత్యాన్వేషణలోదైవత్వం గుర్తించుకోలేక పోయినప్పటికిని, దైవత్వమును గుర్తింపగనే కొన్ని చిహ్నములు ఆవిర్భవిస్తాయి. ఏవిధంగానయితే ఒక

sri sathyasai vahini

వృక్షము చూపించి, దాని కొమ్మపైనున్న నక్షత్రమే ధృవ నక్షత్రమని చెబుతారో, దైవ చిహ్నముల ద్వారా దైవత్వమును గుర్తించవచ్చు. చెట్టు కొమ్మకు, ధృవనక్షత్రానికి ఏమాత్రం సంబంధము లేదు. కానీ ఆ చెట్టుకొమ్మ నక్షత్రము యొక్క ఉనికి మనకు బోధిస్తున్నది. అదేవిధముగా మనము చేసే సర్వకర్మలు, మనము పలికే ప్రతిపలుకు, నడచే ప్రతినడక, చూచే ప్రతిచూపు యివన్నీ సత్యాన్వేషణలోని భాగములే. ఇవన్నీ భగవంతుని యొక్క ఉనికికి ప్రత్యక్ష ప్రమాణములే. సముద్రాన్ని చూస్తారు. అలలతో ఎంతో ఆనందము కలిగిస్తుంది. ఎత్తైన పర్వతాలను చూస్తారు. ఎంతో ఉత్సాహము కల్గుతుంది. దట్టమైన అరణ్యమును చూస్తారు. అరణ్యము యొక్క పచ్చదనము చూచి హృదయం ఉప్పొంగుతుంది. ఇవన్నీ సత్యాన్వేషణలోని ఉనికి యొక్క అనుభూతులే. ఇది భగవంతుని చూపకపోయినా భగవంతుని శక్తి సామర్థ్యము లను ఈవిధమైన దృశ్యములచేత మనకు గుర్తింపచేస్తున్నాది. ఒక విత్తనము నుండి గొప్ప వృక్షము ప్రారంభమవుతుంది. ఒక గుడ్డు నుండి పిట్ట పుడుతుంది. ఒక ప్రాణి నుండి మరొక ప్రాణి వస్తుంది. ఒక పుష్పము నుండి మంచి సుగంధము వస్తుంది. పాలనుండి వెన్న ప్రారంభమవుతుంది. ఇవన్నీ సత్యాన్వేషణ లోని సారములే. ఈ ప్రపంచమంతయు మూడు విధములైన కర్మల చేత నడుస్తూ ఉన్నాది. ఇవి మన నిత్యజీవితములో ప్రత్యక్షముగా చూచే దృశ్యములే. ఒకటి సృష్టి యొక్క నిర్మాణము. రెండవది సృష్టియొక్క పోషణ. మూడవది సృష్టియొక్క నిర్మూలము. ఈ సృష్టి స్థితి లయములు మూడు అందరికి ప్రత్యక్ష ప్రమాణములే. నిత్యజీవితములో నిత్యము చూచే దృశ్యములే. ఇవన్నీ కేవలము సత్యస్వరూపుని యొక్క ప్రమాణానికి చిహ్నములు. ఈ సత్యాన్ని గుర్తించుటకు తగిన కృషి చేయకుండా దైవమెక్కడ? దైవమెక్కడ? అని విమర్శించటానికి ప్రయత్నం చేస్తున్నారు. దైవాన్ని విమర్శించటము చాలా సులభమే. కానీ దైవాన్ని అన్వేషణ చేయటము చాలా కష్టము. ఎట్లా? భగవంతుడు సత్యములో సత్యముగా ఉంటున్నాడు. చెడ్డలో చెడ్డగా ఉంటున్నాడు. మంచిలో మంచిగా ఉంటున్నాడు. పుణ్యములో పుణ్యముగా ఉంటున్నాడు. పాపములో పాపముగా ఉన్నాడు. దీనిని పురస్కరించుకొనియే గీతా ప్రమాణము “రసో వై సః” అనగా పానకములోని పంచదారవంటివాడు భగవంతుడు. ప్రపంచమంతా రస స్వరూపమే. ఇందులో ప్రతి బిందువునందు భగవంతుడు పంచదారగా

sri sathyasai vachanamrutam

ఉంటున్నాడు. ఇది చూచితే తెలిసేది కాదు. అనుభవించినప్పుడే దాని రుచి అర్థమవుతుంది. ఈ సృష్టి స్థితిలయములు మూడు తన కర్మల ద్వారానే జరుగుతున్నాయి. ఇట్టి మూడు శక్తులకు అధికారి భగవంతుడని వేదములు బోధిస్తూ వచ్చాయి. కేవలం వేదములే కాదు. ఉపనిషత్తులు, ఖురాన్, బైబిలు, గ్రంథరాజము ఇవన్నీ భగవంతుని యొక్క ఉనికిని చెబుతూ వచ్చాయి. సృష్టి స్థితి లయములు మూడూ లేనిది ఎక్కడా గోచరము కాదు. ఎవ్వరైనా దీనిని అంగీకరించక తప్పదు. ఏ వేదాంతి గానీ, ఏ సైంటిస్టుగానీ, ఏ యింజనీరుగానీ, ఏ కాలమువారైనాగానీ, ఏ దేశమువారైనాకానీ సృష్టి స్థితి లయములను అంగీకరించక తప్పదు. దానినే ఆంగ్లభాషయందు God అన్నారు. ఈ సృష్టియొక్క అర్థాన్ని మనము God లో గుర్తించవచ్చును. G - generation (సృష్టి), O - organisation (స్థితి), D - destruction (లయము) ఇట్టి సత్యాన్ని ప్రతి పదమునందు మనము విచారణ చేసి సత్యాన్వేషణ సల్పినప్పుడు గుర్తించటానికి వీలవుతుంది. Generation తన సంకల్పమే. Organisation తన యొక్క సంకల్పమే. Destruction కూడా తన నిర్ణయమే. ఈ సృష్టి స్థితి లయములు మూడు లేకుండా జగత్తు ఉండుటకు వీలు కాదు. ఈ మూడు కర్మల చేత జగత్తు నడుస్తుంది. ఇలాంటి తత్వమును అర్థము చేసుకోవాలంటే ఏవిధమైన మార్గమును అనుసరించాలి? మానవుని యొక్క సమస్త సంకల్పములు హృదయము నుండే ఆవిర్భవిస్తున్నాయి. హృదయాన్ని మధురంగా ఉంచుకున్నప్పుడు పలుకులు, చేష్టలు, కర్మలు సర్వము మధురంగానే ఉంటాయి. హృదయం పవిత్రమైనప్పుడు కర్మలన్ని సార్థకమైన కర్మలుగా రూపొందుతాయి. మానవుని మంచి చెడ్డలు రెండు హృదయము నుండి ఆవిర్భవించే ఫలితములే. చెడ్డ ఎక్కడనుండో రావటం లేదు. మంచి ఎక్కడ నుండో రావటం లేదు. హృదయమునందే వస్తున్నాయి.

**కష్టసుఖములు రెండును కలసి యుండు**
**దీని విడదీయ ఎవ్వరి వశము కాదు**
**సుఖము ప్రత్యేకముగా ఎందు చూడబోము**
**కష్టము ఫలించెనేని సుఖం బటంద్రు**

అంతా ఒక్కటే. "ఏకం సత్ విప్రా బహుదా వదంతి" ఉన్నది ఒక్కటే. అట్టి ఏక సత్యాన్ని

sri sathyasai vachanamrutam

గుర్తించటానికి మానవత్వము చాలా సులభమైన మార్గం బోధిస్తున్నది. "మదాత్మ సర్వభూతాంతరాత్మ" ఇదే దీనికి సరైన ఆదర్శము. నా ఆత్మయే సర్వులయందు ఆత్మగా ఉంటున్నాది. ఇంతేకాదు. మానవుని యొక్క శరీరము ఐదు కోశములలో ఉంటున్నాది. అన్నమయకోశము, ప్రాణమయకోశము, మనోమయకోశము, విజ్ఞానమయకోశము, ఆనందమయకోశము. ఈ ఐదు కోశములందుండిన విజ్ఞానమయకోశము ఒక్క మానవునికి తప్ప మరొక ప్రాణికి లేదు. విజ్ఞానముతో, ప్రజ్ఞానముతో కూడిన మానవత్వాన్ని అల్పత్వమని భావించరాదు. మానవత్వాన్ని చాలా అల్పముగా భావించుకొని దాన్ని సరైన మార్గములో ఉపయోగించుకొనకుండా వ్యర్థము గావించుకుంటున్నారు. సకల సద్గుణ సంపన్నుడైన మానవుడు ఏవిధంగా అల్పుడుగా భావించుటకు వీలవుతుంది? అదియే మానవుని బలహీనత. తన తత్వాన్ని తాను గుర్తించుకొనలేక కేవలం తన దేహ బలహీనత మాత్రమే గుర్తించుకొని అన్నమయకోశమును ఆధారము చేసుకుని బ్రతుకుతున్నాడు. అన్నమయకోశము కాదు ప్రధానమైనది. ఈ అన్నమయకోశమును ఆధారము చేసుకున్నంత వరకు అశాంతియే గానీ శాంతి మనకు లభ్యము కాదు. అరువది నాలుగు విద్యలు అరుదారుగా నేర్చినట్టి ఆ నారదుడే శాంతి లభించకుండా అనేక అవస్థలకు గురౌతూ వచ్చాడు. కట్టకడపటికి సనత్కుమారుని దగ్గరకు వెళ్ళి ప్రార్థిస్తున్నాడు స్వామీ! నా అజ్ఞానము దూరము చేసి శాంతిని ప్రసాదించే విద్య బోధించమన్నాడు. 'నారదా నీకు తెలియని విద్యలు లేవు. సమస్త శాస్త్రములు, సర్వోపనిషత్తులు సర్వ వేదములు, నీకు తెలుసు. ఈ విద్యలవల్ల, లభించే ఆనందము ఏమాత్రము లేదు. ఇవన్నీ ప్రాకృతమైన, భౌతికమైన విద్యలు. కేవలం అనిత్యమైన విద్యలు. ఈ అనిత్యమైన విద్యలు పోయేంత వరకు శాంతి నీకు లభించదు' అన్నాడు. దీనినే సైంటిస్టులు కూడా చెబుతూ వచ్చారు. ఏనాడు, ఎక్కడ, ఎప్పుడు ఈ సైన్సు అంత్యమవుతుందో అక్కడ ఈ ఆధ్యాత్మికము ప్రారంభమవుతుంది. Where science ends spirituality begins. యిది ముఖ్యమైనది. ఈ ప్రాకృత చర్యలన్నీ సైన్సుకు సంబంధించినవి. ఈ భౌతిక దేహమునకు అవసరమైనవి. భౌతిక దేహమును కాపాడుకొనవలసినదే. కానీ యిదే సత్యము, నిత్యమని భావించి సర్వము అర్పితము గావించకూడదు. సమస్త కర్మలచేత సాధించగలిగేది యీ దేహమే. దేహము

sri sathyasai vahini amrutam

చేతనే దైవాన్ని కూడను సాధించవచ్చును. ఈ దేహమును "నేను" అను అంహకార భావముతోకాక దైవాన్ని సాధింపచేసే పనిముట్టుగా భావించాలి. ఇది నా దేహము, ఇది నా బుద్ధి. ఇది నా చిత్తము, ఇది నా ఇంద్రియము. ఇది నా అంతఃకరణ అంటున్నావు. నేనెవరు? ఈ ప్రశ్న ఎవరూ వేసుకోటం లేదు. ఇది నా కర్చీఫ్ అంటున్నప్పుడు కర్ఛీఫ్ వేరు, నేను వేరు. అదే విధముగా నా దేహమంటే దేహము వేరు, నేను వేరు. నీవెవరు? ఈ సత్యము గుర్తించుటకు వెనుకంజ వేస్తూ చూచే దృశ్యములే సత్యముగా భావించుకొని విశ్వసిస్తున్నారు. ఈ దేహము సత్యము నిరూపించే పనిముట్టు. అయితే ఈ దేహమందు దివ్యతమైన పరమాత్మతత్వము యిమిడి ఉంటున్నది. ఇవన్నీ పదార్థములే. యివన్నీ నెగిటివ్వే. పాజిటివ్ ఏది? ఇదంతా నీవు పాజిటివ్‌గా భావించుకొని అనుభవించాలి. నెగిటివ్‌ను మనస్సులోకే రానివ్వకుండా చూచుకోవాలి. ఈ నెగిటివ్స్ నెగిటివ్స్‌నే అందిస్తుంది. ఈనాటి ప్రపంచము యొక్క అశాంతికి మూలకారణము నెగిటివ్స్‌పై ఆధారపడటమే. ఇదంతా matter. నీవు master. Master the mind, be a master mind. నీవు master గా తయారుకావాలి. అది నిజమైన విద్య. అంతేకానీ bookish knowledge నిజమైన విద్య కాదు. ఈ ప్రాకృతమైన, అనిత్యమైన జీవితంలో ఆదర్శము నిరూపించుటకు సాధించ వలసినవి ఎన్నో ఉంటున్నాయి.

**ప్రేమ– త్యాగం– శీలము**

అన్నింటికి ప్రేమ, త్యాగమే చాలా ప్రధానమైనది. ఒకానొక కాలములో విక్టోరియా రాణి రాజ్యమేలుతూ వచ్చింది. ఆమె దగ్గర విలియం అని ప్రైమినిష్టరుండేవాడు. అతను గొప్ప తెలివి తేటలు గలవాడు. గొప్ప విద్యావంతుడు. గొప్ప రాజకీయవేత్త. అలాంటి వాడు ప్రేమ చేతను, త్యాగము చేతను దైవత్వాన్ని నిరూపించి తన కర్తవ్యము నిర్వహిస్తూ వచ్చాడు. ఎవరితో మాట్లాడినా ప్రీతితో మాట్లాడటం. ఎవరికి ఏపని చెప్పినా ప్రీతితో చెప్పటం. అశాంతి అనేది అతనిలో ఏమాత్రము కనిపించలేదు. లార్డుబ్రెయిల్స్ అతని చరిత్ర వ్రాస్తూ దీనిని ఉదహరించాడు. ఆ రాజకీయవేత్త విలియమ్స్ దైవస్వరూపుడు అన్నాడు. ఎందుకనగా దైవానికి పవిత్రమైన గుణములే ప్రమాణము. ఎక్కడ స్వార్థరహితమైన ప్రేమ, ఎక్కడ స్వార్థరహితమైన త్యాగము ఎక్కడ, స్వార్థ రహితమైన ఆనందము ఉంటుందో

sri sathyasai vahamrutam

అక్కడనే భగవంతుడుంటాడు. మానవుడు భగవత్స్వరూపుడే. మానవుని యందు యిట్టి పవిత్రమైన గుణములుంటున్నాయి. కానీ ఆ గుణములు సరైన రీతిలో ప్రయత్న పూర్వకంగా ప్రాక్టికల్‌లో పెట్టటం లేదు. ప్రతి మానవునియందు దైవత్వము ఉంటున్నది. అట్టి దివ్యత్వమును గుర్తించుకో లేకుండా కేవలం దేహమునకు, ప్రాణమునకు, మనస్సుకు సంబంధించిన వ్యవహారములోపడి విలువైన జీవితాన్ని వ్యర్థము గావించు కుంటున్నాడు. మానవుడు ఎలాంటివాడు? భూమిని విలువైనదిగా భావిస్తున్నాడు. డైమండు గొప్ప విలువైనదిగా భావిస్తున్నాడు. బంగారు విలువైనదిగా విశ్వసిస్తున్నాడు. చాలా పొరపాటు. ఈ డైమండ్‌కు విలువ యిచ్చేది ఎవరు? బంగారుకు విలువ యిచ్చేది ఎవరు? భూమికి విలువ యిచ్చేది ఎవరు? మనిషే. మనిషే లేక దీనికి విలువే లేదు. కనుక men are more valuable than all the wealth of the world అన్నారు. మానవుడు ఈ ప్రపంచములోనున్న అన్నింటి కంటె విలువైనవాడు. సౌజన్యము, సౌశీల్యము మానవుని యొక్క ప్రధాన గుణములు. ప్రేమయే యితని ప్రాణము, ప్రేమ లేక మానవుడే లేడు. కనుక Love is God. Live in love. ఆ ప్రేమతత్వాన్ని మనము యేనాడు అభివృద్ధి పరచుకోవాలి. విశాలమైన ప్రేమను మనం అభివృద్ధిపరచాలి. ఈ విశాల ప్రపంచమందు మన ప్రేమ విశాలముగా ఉండాలి. ఈ విశాలమైన ప్రపంచ మందు దయ విశాలంగా ఉండాలి. ఎంతో విశాలమైన ప్రపంచ మందు యింత సంకుచితమైన ప్రేమను పెట్టుకుంటే సరైన మానవత్వము కాదు. అంతా విశాలమైపోవాలి. అప్పుడే నిజమైన మానవత్వాన్ని గుర్తించటానికి వీలవుతుంది. ఈ దేహానికి, ఈ మనస్సుకు ఎన్నో కష్టములు, నష్టములు, దుఃఖములు సంభవిస్తుంటాయి. ఇవన్నీ కదలిపోయే మేఘములేగానీ శాశ్వతమైనవికావు. వస్తుంటాయి, పోతుంటాయి. కానీ గుణములు చాలా ప్రధానమైనవి. ఆ గుణములు మనం పోషించుకోవాలి. ప్రపంచమునకు ఆశయాలుంటున్నాయి. ప్రతి దేశమునకు సామూహిక ధర్మములుంటున్నాయి. ఈ ధర్మములను, ఈ పద్ధతులను ఏనాడు వదలుతున్నారో ఆనాడే అధోగతికి పోతున్నారు. భారతీయ సంస్కృతి చాలా పవిత్రమైనది. ఎన్ని వేల సంవత్సరములైనా యిది కదలక మెదలక శాశ్వతంగా నిల్చి ఉంటున్నాది. ఒక విశాలమైన వృక్షముంటున్నాది. ఈ వృక్షముయొక్క వేర్లు అడుగుభాగమున పాతాళమునకు నీటివైపున తిరిగినప్పుడే ఆ వృక్షము

sri sathyasai vachanamrutam

భద్రముగా ఉంటుంది. ఈ పాతాళమునకు ఈ వేర్లు పోకుండిన కేవలము ఏ చిన్నగాలి వచ్చినా పడిపోతుంది. మిగతా దేశములందున్న సంస్కృతులన్నీ ఏనాడో వెళ్ళిపోయినాయి. ఒక్క భారతదేశ సంస్కృతి మాత్రమే నేటికి నాటికి ఏనాటికి శాశ్వతముగా నిల్చి ఉంటున్నది. కారణం ఏమిటి? దివ్యత్వమైన పాతాళమునకు దిగిపోయినాయి యీ వేళ్ళు. దివ్యత్వమైన జలమే ఈ సంస్కృతిని పోషిస్తున్నాది. భారతీయ సంస్కృతి కొన్ని ఆదర్శములుగా తీసుకున్నది కాదు. ఏది మారినా యిది మారేది కాదు. భారతీయ ఆదర్శము శాశ్వతమైన ఆదర్శము. ఇలాంటి దాన్ని మనం సరిగా గుర్తించుకోలేకపోతున్నాం. ఈనాటి విజ్ఞానము మితిమీరిపోయింది. కావలసినంత సుఖాన్ని అందిసున్నది. కానీ సుఖముండి ప్రయోజనం ఏమిటి? శాంతి లేకపోతున్నది. శాంతి లేని సుఖము ఒక సుఖమా? శాంతి కావాలి మానవునకు. ఎన్నియో అభివృద్ధులు పొందుతున్నారు. దీనినే ఒకానొక సమయంలో చర్చిల్ చెప్పాడు. మానవుడు అన్నింటిని సాధిస్తున్నాడు. అన్నింటిని అనుభవిస్తున్నాడు. కానీ తనను తాను సాధించుకోలేకపోయినాడు. Man has conquered all, but he has not conquered himself అన్నాడు. తనను సాధించుకోలేనివాడు ఎన్ని సాధించి ప్రయోజనం ఏమిటి? దీనినే ఆనాటి బాల ప్రహ్లాదుడు తండ్రికి బుద్ధి నేర్పుతూ వచ్చాడు. "నాన్నా! పంచభూతములను హస్తగతము గావించుకుని ఆడుకుంటున్నావు. కానీ నిన్ను నీవు జయించుకో లేకపోతున్నావు. ప్రపంచమునంతా సాధిస్తున్నావు కానీ నిన్ను నీవు సాధించుకో లేనివాడవు ప్రపంచము సాధించి ప్రయోజనం ఏమిటి? లోకములన్నియున్ ఘడియలోన జయించినవాడవు. నన్ను, యింద్రియలోకము ఏమాత్రము జయించలేక పోతున్నావు" అని ప్రశ్నించాడు. అన్నింటిని సాధిస్తున్నారు. కానీ తన యింద్రియములను అదుపులో పెట్టుకోలేకపోతున్నాడు. తన మనస్సు తాను స్వాధీనము చేసుకోలేక పోతున్నాడు. అది లేనప్పుడు, ఎన్ని సాధించి ప్రయోజనం ఏమిటి? మొట్టమొదట మనస్సును స్వాధీనం చేసుకోవాలి. ఈ మనస్సు స్వాధీనము ఒక్క ఆధ్యాత్మిక మార్గములో తప్ప అన్యమార్గములో యిది స్వాధీనము కాదు.

**గురుదేవో మహేశ్వరః**

గురుపౌర్ణిమి అనుటకు మూలకారణం ఏమిటి? గురువు అనగా కేవలం విద్యను

sri sathyasaivachanamrutam

నేర్పినవాడిని గురువుగా భావిస్తున్నారు. కానీ అందరు గురువులు కాదు. అందరు అధ్యాపకులు. గురువు ఒక్కడే, అతనే దైవము. అనేకమంది గురువులు వచ్చి ఈ గురుపౌర్ణిమ దినము గురుపూజలు చేయించుకుంటు, గురుదక్షిణలు తీసుకుంటు వ్యాపారములు ప్రారంభిస్తున్నారు. "గురు" అనగా గుకారో గుణాతీతః, రుకారో రూప వర్జితః. రూపవర్జితుడైనవాడు, గుణాతీతుడైనవాడు భగవంతుడొక్కడే. గు అనగా అజ్ఞానము. రు అనగా దాని నిర్మూలనము. అజ్ఞానము నిర్మూలనము చేసేవాడే గురువు. ఇంకా ఆశలను పెంచుకుంటున్నారే గానీ అజ్ఞానం పోవటం లేదు. గురువులు కూడా ఇలాగే మానవులను పెడమార్గం పట్టించే గురువులుగా తయారౌతున్నారు. ప్రాపంచక సంబంధమైన విద్యలందు గురువులు అనేకంగా ఉంటున్నారు. నైతిక, భౌతిక, ధార్మిక అన్ని మార్గములందు గురువులుంటున్నారు. వీరందరిలో వ్యాపారము ప్రారంభమైంది. ఈనాడు కలియుగమందు ఆధ్యాత్మికము కూడా ఒక వ్యాపారంగా రూపొందింది. ఏనాడు ఆధ్యాత్మికము వ్యాపారములో పడిపోయిందో యిది ఆధ్యాత్మికమే కాదు. ఆధ్యాత్మికములో ఏమాత్రము వ్యాపారము ఉండకూడదు. లౌకికప్రేమలకు, ఆధ్యాత్మిక ప్రేమకు ఉండిన వ్యత్యాసము గుర్తించాలి. ప్రాపంచిక ప్రేమ కేవలం పుచ్చుకోటానికి సిద్ధంగా ఉంటుంది. కానీ దైవప్రేమ యిచ్చుకోటానికి సిద్ధంగా ఉంటుంది. ఎప్పుడు యిచ్చుకునేదే, యిచ్చుకునేదే. ఇదియే నిజమైన దైవత్వము. ఇదియే నిజమైన పవిత్రము. ఇదియే ప్రాకృతమునకు విరుద్ధమైన మార్గము. ఈ ప్రాకృతమైన మార్గములో ప్రవేశించి అన్ని విధాలా జీవితమును వ్యర్థము గావించుకుంటున్నారు. ఇది కేవలం ప్రవృత్తి మార్గమే. మనం నివృత్తి మార్గములో ప్రవేశించాలి. లౌకిక కార్యములన్నీ చేసుకోవచ్చు, తప్పులేదు. అయితే ఏ కర్మలాచరించినప్పటికిని **"సర్వకర్మ భగవత్ప్రీత్యర్థం"** అనే భావముతో చేయాలి. ఉద్యోగము చేసుకో, చదువుకో, గొప్ప పదవి కోరుకో, ఏమి చేసినా యిదంతా దైవ ప్రసాదంగా భావించుకోవాలి. అప్పుడే నిజమైన మానవత్వాన్ని అనుభవించిన వాడౌతాడు. మానవుడనగా ఏమిటి? సత్ప్రవర్తన, సదాలోచన, సచ్ఛీలము ఈ మూడింటి ఏకత్వమే నిజమైన మానవత్వము. కనుక సత్యాన్ని మనం వదలకూడదు. ప్రేమను నిరంతరం ప్రవహింపచేయాలి. కానీ ఈనాటి మానవులు ఆరోగ్యము కోల్పోవటానికి మూలకారణం

sri sathyasai vahamrutam

ఏమిటి? అశుద్ధమైన జలము, అశుద్ధమైన పదార్ధములు, అశుద్ధమైన గాలి, అంతా అశుద్ధమే. ఆహారము, జలము పరిశుద్ధము చేసుకోవడంతో పాటు మనసును కూడా పవిత్రంగా ఉంచుకోవాలి.

**మనసు- మర్మము**

మనసు కలుషితం అయిపోయింది. మానసిక సంబంధమైన అశాంతి చేతనే, మానసిక సంబంధమైన అనారోగ్యముచేతనే మానవుడు క్షీణించి పోతున్నాడు. ఈనాటి మానవులకు రోగములు ఏదో అంటువ్యాధులుగా వస్తున్నాయని అనుకుంటున్నారు. చాలా పొరపాటు. మానవునికి రోగమే లేదు. కానీ సైకాలజికల్‌గా తనకు రోగమున్నట్లు భ్రమించుకొని ఒక రోగిగా రూపొందుతున్నాడు. 90% మానవునికి రోగములు సైకలాజికల్‌గా వస్తున్నాయి. మానసిక సంబంధమైన రోగములే అధికముగా వస్తున్నాయి. నిరంతరము చింతించి, చింతించి రోగానికి గురౌతున్నాడు. గాల్టిన్ అనేవాడు ఒక హృద్రోగ నిపుణుడు (heart doctor). అతను నిరంతరము యితరుల గుండె పరిశీలిస్తూ తన గుండె ఎట్లా ఉందో ఏమో అని యోచన చేసుకునేవాడు. కట్టకడపటికి అతను గుండె జబ్బుతోనే మరణించాడు. యింకొక డాక్టరు Bleedy. అతను జీర్ణశక్తి గురించి అన్నివిధాలా పరిశోధనలు సల్పేవాడు. ప్రతి వ్యక్తి జీర్ణకోశాన్ని పరీక్షచేసే సమయంలో తన జీర్ణశక్తి ఎట్లా ఉందో ఏమో అని తనకు తాను పోల్చుకునేవాడు. కట్టకడపటికి అతనికి అజీర్ణవ్యాధి వచ్చి మరణించాడు. మానసిక ప్రభావము అధికముగా ఉంటున్నాది. కనుకనే "మనయేవ మనుష్యాణాం కారణం బంధ మోక్షయోః" అనగా బంధమునక, మోక్షమునకు రెండింటికి మనస్సే మూలకారణమన్నారు. ఈ మనస్సును పవిత్రమైన మార్గములో ప్రవేశపెడితే అంతా పవిత్రంగానే రూపొందుతాడు మానవుడు. చేసే పనులు, చూసే దృష్టి అంతా మంచిదిగానే ఉంటుంది. యిది ఒక తాళము. యిది ఒక తాళంచెవి. యిది తాళంలో పెట్టి ఎడమవైపు త్రిప్పితే తాళం పడుతుంది. కుడివైపు త్రిప్పితే తాళం వస్తుంది. ఈ తాళం వేయుటకు, తీయుటకు ఒకే తాళంచెవి కానీ తిప్పడంలోనే తేడా. అదేవిధముగా హృదయమే తాళం, మనస్సే తాళంచెవి. భగవంతుడి వైపు త్రిప్పినచో విమోచన, ప్రపంచం వైపు త్రిప్పినచో బంధన. ఈ బంధనకు, మోక్షమునకు మనస్సే కారణము. ఈనాడు మనస్సును

ప్రాకృత భావములచేత ప్రపంచములో ప్రవేశపెట్టకుండ భగవంతుని వైపు మరల్చుటకు సాధన చేయాలి.

**దేవుడు అందరికన్నా దగ్గరగా ఉన్నాడు.**

"సర్వంఖల్విదం బ్రహ్మ" అంతా బ్రహ్మగానే భావించుకో. ఏది చూచినా బ్రహ్మగానే ఉన్నాది. ఇదే రామకృష్ణ దగ్గరకు వెళ్ళి అనేకమంది ప్రశ్నలు వేసారు. వివేకానంద కూడా వెళ్ళాడు. స్వామీజీ! మీరు దేవునిచూచారా! అని అడిగాడు. 'అవును చూచాను' అన్నాడు. 'ఎట్లా చూచారు' అన్నాడు. నిన్ను నేను ఎట్లా చూస్తున్నానో, నన్ను నీవు ఎట్లా చూస్తున్నావో అట్లా చూస్తున్నాను దేవుని" అన్నాడు. మరినాకెందుకు చూపకూడదు? అన్నాడు. నీవు చూడవచ్చును అన్నాడు. నాకు కనిపించటం లేదే అన్నాడు. "పశ్యన్నపిచ న పశ్యతి మూఢో మూఢో" అన్నాడు. పిచ్చివాడా! నీవు దేవుని చూస్తూ కూడను దేవుని చూడలేదనుకుంటున్నావు. ఇంతకంటే మూఢుడు మరొకడు లేడు అన్నాడు. ప్రాకృత దృష్టితో ప్రపంచాన్ని చూస్తున్నావు. నేను ప్రపంచాన్ని దైవదృష్టితో చూస్తున్నాను. కనుక మన భావం చాలా ముఖ్యం. అయితే ఈ లోకములోని మానవులు బిడ్డలకోసం ఏడుస్తున్నారు. భార్యలకోసం ఏడుస్తున్నారు. ధనం కోసం ఏడుస్తున్నారు, ధాన్యం కోసం ఏడుస్తున్నారు. కానీ దైవం కోసం ఏడ్చేవాడు ఒక్కడైనా కనిపించలేదే. దైవం కోసం ఏడ్చినప్పుడే దైవం కనపడతాడు. ఏడ్చేది లోకంకోసం, కనిపించాలి అనుకునేది దైవం. ఎట్లా కనపడతాడు? యిది అసాధ్యం. దేనికోసం ఏడుస్తావో అది నీకు కనిపిస్తుంది. కనుక నీవు దైవం కోసం ఏడ్చు అని బోధ చేశాడు రామకృష్ణ పరమహంస. ప్రతి ఒక్కటి మన మనస్సులో ఉంటున్నాది గానీ బయటకు రావటం లేదు. కానీ దైవాన్ని చూడాలనుకున్నప్పుడు, దైవము కావాలనుకున్నప్పుడు దైవం కోసం అంకితము కావాలి. నీవు ధన ధాన్య యశస్సులకోసం పాటు పడుతున్నావు. బంధుమిత్రుల కోసం పాటుపడుతున్నావు. పేరు ప్రతిష్ఠలకోసం పాటుపడుతున్నావు. ఆ పడే బాధలలో ఒక్క క్షణం దైవం కోసం పాటుపడు తప్పక దైవ దర్శనం లభిస్తుంది.

**యాచింతా భువి పుత్ర మిత్ర భరణౌ వ్యాపార సంభాషణే**

srisathyasaivachanamrutam

**యాచింతా ధన ధాన్య భోగ యశసే లాభే సదా జాయతే**
**సాచింతా భువి నందనందన పదద్వంద్వారవిందే క్షణే**
**కాచింతా యమరాజ భీమ సదన ద్వార ప్రయాణే ప్రభో**

ఒక్క క్షణము ఆ భగవంతునిపై నిలుపు. గంటలు గంటలంతా ప్రాపంచిక విషయాలపై నిలుపుతున్నావు. ఒక్క క్షణమైనా దైవముపై నిల్చటానికి ప్రయత్నం చేయటం లేదు. దైవము ఎట్లా నీకు చిక్కుతాడు.? దైవచింతన చేసినప్పుడు హృదయ కవాటము తెరుచుకుంటుంది. ఇది తెరుచుకోవాలంటే ప్రేమయే తగిన తాళంచెవి. ప్రేమను భద్రంగా పెట్టుకోవాలి. ప్రేమ లేక దేనిని మనం సాధించలేము. ప్రపంచములో సర్వము ప్రేమద్వారానే సాధిస్తున్నాము. ఆ ప్రేమను దైవంవైపు మరల్చాలి.

**త్వమేవ మాతాచ పితా త్వమేవ త్వమేవ బంధుశ్చ సఖాత్వమేవ**
**త్వమేవ విద్యా ద్రవిణం త్వమేవ త్వమేవ సర్వం మమ దేవ దేవా**

తల్లిని ప్రేమించు మాతృదేవోభవ, పితృదేవోభవ తండ్రిని ప్రేమించు, గురుదేవోభవ గురువును ప్రేమించు, గౌరవించు, తగిన సేవ సల్పు. కానీ వీరందరు దైవ సమానులే కానీ దైవము వీరందరి స్వరూపము, వీరందరి కంటే అతీత స్వరూపము కూడా. తల్లిని దైవంగా ప్రేమించు. తల్లి నివసించేది ఎక్కడ, ఒక ఇంటిలో నివసిస్తున్నాది. ఆ యింటికి ఆమె దైవమే. పితృదేవోభవ. తండ్రి ఎక్కడ జీవిస్తున్నాడు. అతను ఒక యింటిలో నివాసము చేస్తున్నాడు. అతను కూడా ఒక ఇంటి దేవుడే. గురుదేవోభవ. గురువు ఎక్కడ నివసిస్తున్నాడు. ఒక ఆశ్రమంలో జీవిస్తున్నాడు. కాబట్టి అతనిని గౌరవించి ప్రేమించు. కానీ దైవము ఎక్కడ జీవిస్తున్నాడు? ఇంటిలో కాదు, ఆశ్రమములో కాదు. హృదయములో ఉంటున్నాడు. హృదయవాసి దైవము. కానీ హృదయమునందే ఉన్న దైవాన్ని నీవు ప్రేమించు. వీరందరూ అనిత్యము, అశాశ్వతము అయిన గృహాల్లో ఉండేవారు. దైవము శాశ్వతుడు, నిత్యుడు.

**సత్యం-జ్ఞానం-అనంతం-బ్రహ్మ**

**పాంచభౌతికము దుర్బలమైన కాయము**



sri sathyasai vachanamrutam

ఎప్పుడో విడిచేది ఎరుకలేదు
శతవర్షములదాక మితము చెప్పిరిగాని
నమ్మరాదా మాట నెమ్మనమున
బాల్యమందో మంచి ప్రాయమందో లేక
ముదిమియందో లేక ముసలియందో
ఊరనో అడవినో ఉదక మధ్యంబునో
ఎక్కడో విడిచేది ఎరుకలేదు
మరణమే నిశ్చయమ్మది మానవునకు
బుద్ధిమంతుడై తన దేహమున్నయపుడె
తన్ను తాను తెలియుట ధర్మతత్వమరయ
సత్యమైనట్టి బాట శ్రీసాయిమాట

ఏమిటి ఈ దేహము?

మలినపుకొంప రోగముల ప్రుగ్గెడు సేవక గంప జాతసం
చలనము పొందు దుంప భవసాగర మీదగ లేని కంప
అంబులపొది లెమ్ము చూడ మనమెప్పు దలంపగ దేహమింక
నిలువునని నమ్మబోకు మనసా! హరి పాదములాశ్రయింపవే.

ఇదియే వేదాంతము బోధించిన బోధనలు

పుస్తకముల్ పఠించితివి పూర్తిగ చూచితి సర్వశాస్త్రముల్
నిస్తులమైన విద్యలు నేర్చితినంచును గర్వమేల నీ
హస్తయుగంబు మోడ్చి పరమాత్మను భక్తితో కొల్వలేని యీ
ప్రస్తుత విద్యలన్నియు పాడగు విద్యలే చూడ మానవా

విద్యలు ఎందుకు? ప్రయోజనం లేదు. పుట్టినప్పటినుంచి అన్నీ నేర్చుకుంటున్నారు. దేనికోసం నేర్చుకుంటున్నారు? ఈనాడు లోకములో ఏ సాధనలు చేసినా, ఏ సాధకుడు కూడా భగవంతుని నిమిత్తమై ఎవరు చేయటం లేదు. తపము చేయి, యోగముచేయి,

sri sathyasaivachanamrutam

యజ్ఞము చేయి అన్నీ తమ నిమిత్తమై తాము చేసుకుంటున్నారు గానీ భగవంతుని నిమిత్తము కాదు. ఎవరి స్వార్థం కోసం వారు చేస్తున్నారు. ఎవ్వరూ దైవం కోసం చేయటం లేదు. ఎవరు దైవం కోసం చేస్తున్నారో వాడు దైవంగా మారిపోతాడు. అతనే బ్రహ్మవిత్ బ్రహ్మైవ భవతి. నేను గంటసేపు ధ్యానం చేస్తున్నాను అంటారు. ఎవరికోసం చేస్తున్నావు యీ ధ్యానం. నీకోసం నీవు చేసుకుంటున్నావు. జపం చేస్తున్నాను. ఎవరి కోసం చేస్తునావు. నీకోసం నీవు చేస్తున్నావు. అంతా పూజలు చేస్తున్నారు. ఇవన్నీ నీకోసం నీవు చేస్తున్నావు. తన కోసం తాను చేసుకుంటు, దైవానికి చేస్తున్నామను కోవటం చాలా పొరపాటు. అయితే నీకోసం నీవు చేసుకుంటున్నప్పుడు నీవే దైవంగా భావించుకో. I am not man. Iam god అని నీవు అనుకో. యిదే నిజమైన దైవము. నీవు మనిషిగా భావించవద్దు. నీవు మనిషిగా భావించుకోటం సగం సత్యము. I am man half truth. I am not animal half truth. I am man, not animal. అప్పుడు full man గా తయారౌతాడు. ఈ మనిషే దైవ స్వరూపకంగా మారిపోతాడు. "దైవం మానుష రూపేణ." మానుషరూపంగా వచ్చేశాడు. కనుక మానవుడు మానవుడుగా భావించుకొనక నేను దైవమనే భావం పెంచుకోవాలి. తెల్లవారు లేచిన దగ్గర నుండి రాత్రి పరుండినంతవరకు 24 గంటలలో 21,600 మార్లు సో-హం అని మనం ఉచ్ఛరిస్తున్నాం. ఈ సోహం అంటే అర్థము ఏమిటి? I am god. సో- అతడు (భగవంతుడు). హం-నేను అనగా నేనే దైవము. నీవే దైవమయినప్పుడు నీవెందుకు మానవుడుగా విశ్వసించాలి? దేహము మానవ దేహము. కానీ దైవము నివాసము. Body is the temple of god. దేహమును ఒక మందిరమని మనం విశ్వసించాలి. క్షేత్రము ఇది. తాను క్షేత్రజ్ఞుడు. క్షేత్రజ్ఞుడు ఉండటం చేత క్షేత్రమని పేరు వచ్చింది. క్షేత్రజ్ఞుడే లేకపోతే యిది క్షేత్రమే కాదు. కనుక క్షేత్రజ్ఞుడు ప్రతి వానియందు ఉంటున్నాడు. అట్టి విశ్వాసమును పెంచుకోవాలి. అప్పుడే దుర్గుణములు, దురాలోచనలు, దుశ్చింతలు దూరమైపోతాయి. ఈనాడు పెద్ద తీరని వ్యాధి ప్రతి ఒక్కరియందును ఉంటున్నాది. ఏ జబ్బుకైనా నివారణ చేసే మందు ఉన్నాది గానీ ఈ జబ్బు నివారణ చేసే మందే లేదు. ఏమిటి ఆ జబ్బు? అదే అహంకారము. చిన్నవానికి చిన్న అహంకారం పెద్ద వానికి పెద్ద అహంకారం. పాత్రను బట్టి అహంకారం ప్రవేశిస్తుంది. పాత్రను బట్టి నీరు నింపుతుంది. క్వాంటిటిలో తేడా ఉన్నదేమో

srisathyasaivachanamrutam

గాని క్వాలిటి అంత ఒక్కటే. ఈ అహంకారమును నిర్మూలం చేయాలి. నాదేహము అనుకోవటం ఒక మమకారము.

## దృష్టి - సృష్టి

ప్రేమస్వరూపులారా! అహంకార మమకారములే సమస్త దుర్గుణములకు మూలకారణము. సమస్త దుర్గుణములు ఈరెండింటి ద్వారానే లభిస్తున్నాయి. ఈ రెండింటిని ఏనాడు దూరము చేస్తావో అప్పుడే నీవు దైవస్వరూపుడౌతావు. విలియం అనేవాడు అందరిని ప్రేమతో పలుకరించేవాడు కనుక అతనిని దైవస్వరూపుడుగా విశ్వసిస్తూ వచ్చాడు లార్డ్ బ్రైట్స్. అనగా ఏమిటి? మనం ప్రేమతో మాట్లాడాలి. సత్యముతో జీవించాలి. శాంతముతో బ్రతకాలి. అప్పుడే మనం దైవస్వరూపులుగా అవుతాం. You cann't always oblige, but you can always speak obligingly. ఈవిధమైన మనస్సుతో మానవత్వాన్ని మనం పెంచుకుంటే దైవత్వముగానే రూపొందుతుంది. కనుక మానవుడు ఆకార మానవుడే గానీ నిజంగా మాధవుడే. "రసో వై సః" పానకములోని పంచదారవలె ఉంటున్నాడు భగవంతుడు. మానవుడు పానకము. పంచదార అతని హృదయమే. అది లేక మానవుడే కాదు. కనుక ప్రతి వ్యక్తి దైవస్వరూపుడే. దైవము యిక్కడున్నాడు అక్కడున్నాడని భేదములు పెట్టుకోకండి. ఎవరు చూసినా నీవు దైవ సమానంగా భావించుకో. "సర్వంఖల్విదం బ్రహ్మ, ఈశ్వర స్సర్వ భూతానం, ఈశావాస్యమిదం సర్వం" ఎక్కడ చూచినా దైవమే ఉండేది. అది ఏవిధంగా అనుభవమవుతుంది? ప్రేమను పెంచుకోవాలి. కంటికి నల్ల అద్దాలు వేసుకుంటే అంతా నల్లగానే కనిపిస్తుంది. కంటికి ఎఱ్ఱ అద్దాలు వేసుకుంటే అంతా ఎరుపుగానే కనిపిస్తుంది. నీ కంటికి ప్రేమ అద్దాలు వేసుకో, అంతా ప్రేమగానే కనిపిస్తుంది. అయితే అద్దాలు ఒకటి, కన్నులు వేరుగా ఉన్నప్పుడు పొరపాటు అవుతుంది. దృష్టికి అడ్డముగా ఉండేటువంటివి అద్దాలు. అనీల్‌కుమార్ కంటికి అద్దాలు వేసుకున్నాడు. అద్దాలు కంటికి అడ్డముగా ఉన్నాయి గానీ, దృష్టికి సహాయం చేస్తున్నాయి. తన దృష్టికి help చేసేలాంటి అద్దాలు వేసుకోవాలి. ఏమిటి మన దృష్టి. ప్రేమ దృష్టి. దైవభావము. ఆ దైవభావమునకు తగిన అద్దాలే మనం వేసుకోవాలి. విరుద్ధమైన అద్దాలు వేసుకుంటే ఉన్న దృష్టి కూడా పోతుంది.

sri sathyasai vahini amrutam

కనుక ప్రేమకు మించిన మార్గం మరొకటి లేదు. ఈ ప్రేమ వల్లనే దయ, సానుభూతి యిలాంటి సద్గుణములు అభివృద్ధి అవుతాయి.

## దైవమే గురువు - గురువే దైవము

ప్రేమస్వరూపులారా! అనేక విధములైన సాధనలు సల్పుతున్నారు మీరు. భగవంతుడు మీ సాధనలు ఎప్పుడూ చూడడు. భగవంతుడు నీ భక్తి ఏమాత్రముకోరడు. ప్రేమను మాత్రమే కోరుతుంటాడు. కొన్ని గంటలకు ముందుగా మా సెంట్రల్ ట్రస్టు మెంబరు ప్రసాద్ వచ్చాడు. ఆయన వచ్చి ఏదో మాటల సందర్భములోపల స్వామీ భక్తునికి, దాసునికి ఉండిన వ్యత్యాసము ఏమిటి అన్నాడు. చెప్పాను. నాయనా! దాసుడనగా దేహమును ఆధారము చేసుకొని భగవంతుని ప్రీతికోసం పాటుపడేవాడు దాసుడు. భక్తుడనగా ఎక్కడున్నప్పటికి దైవాన్ని చింతించేవాడు భక్తుడు. సర్వదా సర్వకాలేషు సర్వత్ర హరి చింతనం చేసేవాడు భక్తుడు. నిరంతరము దైవసేవగానే భావించుకొని ఆశ్రయించిన వాడు దాసుడు. శంకరాచార్యునికి 5గురు శిష్యులుండేవారు. ఒకడు చాలా పరిశుద్ధ హృదయం కలవాడు. వారందరు శాస్త్రములు, వేదములు, బ్రహ్మ సూత్రములు నేర్చుకొనుటకు వచ్చారు. తర్క వ్యాకరణాలు చదువుతూ వచ్చారు. ఒకనాడు శంకరాచార్యులవారు శిష్యులకు ఏదో తర్కము బోధిస్తున్నాడు. ఒక శిష్యుడు మాత్రము గురువు యొక్క సేవ చేయాలి (దాసుడు) అని ఆధారమును తీసుకున్నాడు. తెల్లవారి స్నానము చేసిన తరువాత ఆ గురువు వస్త్రాలు తీసుకువెళ్లటము, గంగలో పిండుకోటం తిరిగి సాయంకాలం తీసుకురావటం. గురువు శారీరక సేవలయందు నిమగ్నమైనాడు శిష్యుడు. గురువు యొక్క నామాన్ని చింతిస్తూ ఆ వస్త్రమును పవిత్రముచేస్తూ వచ్చాడు. అతనికి తెలియదు. నీరు ఉప్పొంగిపోతున్నాది గంగ. తన నడుము వరకు వచ్చింది, కంఠము వరకు వచ్చింది. నది పొంగిపోతున్నాది. అప్పుడు తల ఎత్తి చూచాడు. తాను కొట్టుకొనిపోతానేమో, చచ్చిపోతానేమో అనే బాధలేదు అతనికి. గురు సేవ చేయలేకపోతానే సాయంకాలం లోపల వస్త్రాలు గురువుకు అందించలేకపోతానేమో. గురువుకు ఈ వస్త్రాలు అందించాలి. నా ప్రాణం పోయినా ఫరవాలేదు అన్నాడు. గురూజీ గురూజీ అనుకొని వస్త్రాలు తలపై పెట్టుకొని ఒక్కొక్క అడుగు వేస్తూ వచ్చాడు. ఆ పవిత్రమైన భావమే ఒక్కొక్క

srisathyasaivachanamrutam

అడుగు పెట్టినప్పుడు ఒక రాతి కమలముగా తయారైంది. అతని పేరే పద్మపాదుడు. గురువు అతనిని పిలిపించి ఒక్కసారి ఆశీర్వదించాడు. నాయనా! గురుసేవయే గొప్పది. గురువునే దైవంగా భావించు కున్నావు. గురువు వేరు, దైవం వేరే కాదు.

**గురుర్బ్రహ్మ గురుర్ విష్ణుః గురుదేవో మహేశ్వరః**
**గురుసాక్షాత్ పరబ్రహ్మ తస్మై శ్రీ గురవే నమః**

అని బోధించారు. కానీ ఈనాటి కాలములో గురువే బ్రహ్మ, గురువే విష్ణువు అంటే మోసమవు తుంది. దైవమే గురువు. దైవమే విష్ణువు. ఆ సృష్టి స్థితిలయములు మూడూ దైవమే. దైవాన్ని నీవు గురువుగా తీసుకో. యింకొక వ్యక్తిని నీవు గురువుగా తీసుకోవద్దు అని బోధించి పద్మపాదుని ఆశీర్వదించాడు. అంతకు పూర్వమే మిగిలిన శిష్యులు పద్మపాదుని హేళన చేసేవారు. అప్పుడు ఒక్కతూరి తాము నేర్చిన విద్యలన్నీ పద్మపాదుడు గురుసేవవలన లభించిన అనుగ్రహముతో కంఠస్థముగా చెప్పాడు. చాలా గొప్పగా, చదివిన వారికంటే గొప్పగా తాను బోధిస్తూ వచ్చాడు. నాయనా! ఏవిధంగా నేర్చుకున్నావు అని అడిగారు శంకరులవారు?

**ఈశగిరీశ నరేశ పరేశ**
**సాంబసదాశివ శంభో శంకర**
**శరణం మే తవ చరణ యుగం**

అని గురుకృప వలననే లభించిందని ఎంతో వినయంగా జవాబిచ్చాడు.

**విజయానికి మార్గము**

సర్వము నీవే. శంకరుల వారికి సర్వము అర్పితమై పోయినాను. గురువునకు సర్వము అపర్పితమైతే అన్ని సాధించవచ్చు. శంకరుడు అనగా ఎవరు? శంకలేనివాడే శంకరుడు. శంకరునికి ఏమాత్రం సందేహం లేదు. అలాంటి వానిని నేను ఆశ్రయించాను. దైవముపై ఎవరు ఏ శంక పెట్టుకో కూడదు. సందేహము ఉంటే నీవు ఏమి సాధించలేవు. పూర్ణ విశ్వాసము చేత, పూర్ణ ప్రేమ చేత నీవు ప్రార్థన చేయి, అన్నీ సఫలమై పోతాయి. అన్ని విజయాలను సాధించగలవు. కనుక సంగీతము సాహిత్యము, నృత్యము, సర్వము

srisathyasaivachanamrutam

దైవానుగ్రహముచేత లభించేవి. Gods gift లలితకళలన్నీ దైవ వర ప్రసాదితములే. మీరు నేర్చుకున్నది ఒక్కటీ లేదు. అంతా దైవానుగ్రహము చేత లభించినదే. కనుక దైవానుగ్రహమును ఆశ్రయించిన వానికి ఎట్టి లోపము రాదు. ఎట్టి బాధలు ఉండవు. దైవమే సర్వస్వముగా భావించుకున్న వానికి సర్వము తానుగా మారిపోతాడు. కనుక మనస్సును దైవముపైన మరల్చండి.

**(తేదీ 09-07-1998న కుల్వంత్ హాల్‌లో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam